ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.



Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక






విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను.
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673



PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 08-03-2026 సంపుటి : 1 సంచిక :260 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-


## అమెరికాకు ఇరాన్ లొంగదు



- దేశాన్ని రక్షించేందుకు ప్రజలంతా ఒక్కటవ్వాలి
- అమెరికా అన్‌కండీషనల్ సరెండర్ డిమాండ్‌కు ఇరాన్ ఘాటైన సమాధానం
- పొరుగు గల్ఫ్ దేశాలపై దాడులు చేయబోమని ఇరాన్ ప్రకటన
- ఇజ్రాయెల్, అమెరికా ఒత్తిడికి ఎదురొడ్డి నిలబడతామని స్పష్టం

## ఇరాన్‌లో అన్నింటినీ దెబ్బతీసాం



- ఆదేశ నాయకత్వం, సైన్యం, నౌకాదళం, కమ్యూనికేషన్స్ అన్నీ కుప్పకూలాయి
- ఇరాన్‌పై సైనిక చర్యలను ప్రశంసించిన డొనాల్డ్ ట్రంప్

# భవిష్యత్ టెక్నాలజీల కేంద్రంగా అమరావతి

- ప్రతిష్ఠాత్మక సదస్సుకు తొలిసారి రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆహ్వానం
- ప్రపంచానికి నైపుణ్యాలు, ఉత్పత్తులు అందించే దిశగా ఏపీ
- సదస్సులో పాల్గొన్న110 దేశాల నుంచి 2700 మంది ప్రతినిధులు
- అభివృద్ధి, టెక్నాలజీలో భారత్ వేగంగా ముందుకు
- విశాఖలో 15 బిలియన్ డాలర్లతో గూగుల్ డేటా సెంటర్
- అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా అభివృద్ధి చేస్తాం
- భవిష్యత్తును మార్చనున్న ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్
- అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ నగరంగా తీర్చిదిద్దుతున్నాం
- ప్రపంచంలో తెలుగు ప్రజలు ఉన్నత స్థానాల్లో నిలవడానికి 30 ఏళ్ల క్రితం తీసుకున్న నిర్ణయాలు కారణం
- రైసినా డైలాగ్- 2026లో సీఎం చంద్రబాబు



ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక చర్చలకు వేదికగా నిలిచిన ప్రతిష్ఠాత్మక రైసినా డైలాగ్-2026 సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్ టెక్నాలజీ, నాలెడ్జ్ ఎకానమీ, ఎనర్జీ మార్పులు, జనాభా నిర్వహణ వంటి కీలక అంశాలపై తన దూరదృష్టిని వివరించారు. అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా, బ్లూ,గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయడమే కాకుండా స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ సిటీలతో ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం తీసుకున్న సంస్కరణలే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఉన్నత స్థానాల్లో నిలవడానికి కారణమయ్యాయని పేర్కొంటూ, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ ప్రపంచాన్ని మార్చనున్నాయని అన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, డేటా సెంటర్ల విస్తరణ, నాలెడ్జ్ ఎకానమీ ద్వారా ప్రపంచానికి నైపుణ్యాలు అందించడం, జనాభా నిర్వహణకు కొత్త విధానాలు అమలు చేయడం వంటి అంశాలను కూడా సీఎం ప్రస్తావించారు.ప్రపంచ స్థాయి వ్యూహాత్మక చర్చల వేదికగా నిలిచిన అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సదస్సు రైసినా డైలాగ్-2026లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని దేశ అభివృద్ధి, టెక్నాలజీ విప్లవం, అమరావతి భవిష్యత్ ప్రణాళికలపై తన దృక్పథాన్ని వెల్లడించారు.

## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ 2025 విజేతలు






ప్రజాగాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన గద్దర్ ఫిలిం అవార్డ్సుకు సంబంధించిన 2025 సంవత్సరపు విజేతల జాబితా అధికారికంగా ప్రకటించబడింది. జ్యూరీ సభ్యులు రెడీ చేసిన లిస్ట్ ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేయగా, ఈ సమావేశంలో నిర్మాత దిల్ రాజు, నటుడు తనికెళ్ల భరణి, రోజా రమణి, సంగీత దర్శకుడు మణిశర్మ, నటి ప్రగతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్యూరీ అవార్డు గ్రహీతల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా భారతీయ సినీ పరిశ్రమకు విశేష సేవలు అందించిన మెగాస్టార్ చిరంజీవికి ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ నేషనల్ అవార్డును ప్రకటించగా, విలక్షణ నటి జయసుధకు అక్కినేని నాగేశ్వరరావు అవార్డు దక్కింది.

## మహిళల సాధికారతే సమాజ ప్రగతికి బాట

- విద్య, ఉపాధి, స్వయం సహాయక సంఘాలతో మహిళల ఆర్థిక స్వావలంబన
- ప్రభుత్వ పథకాలు, సామాజిక చైతన్యంతో మహిళల ఎదుగుదల
- కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల కీలక పాత్ర
- ప్రభుత్వ పథకాలతో మహిళల సాధికారతకు కొత్త దిశ
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## సరైన పాలసీలు, విజన్ ఉండాలి

- అప్పుడే-ఎలక్ట్రిక్ మొబిలిటీలో చైనాతో భారత్ పోటీ పడగలదు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



## అక్రమ మద్యం.. మౌనమే జగన్ సమాధానమా?: నారా లోకేశ్



గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం వేల కుటుంబాలను నాశనం చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్రమ మద్యం ద్వారా జగన్ అనుచరుల జేబుల్లో రూ.వేల కోట్లు చేరాయని ఆరోపణలు వచ్చాయన్నారు. రూ.కోట్ల నగదు లావాదేవీలకు సంబంధించి ఈడీ ఆధారాలను బయటపెట్టినట్లు గుర్తు చేశారు. ఈ ఆరోపణలపై ఏపీ ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. 'సమాధానం చెప్పలేక.. మౌనమే జగన్ సమాధానమా' అని అన్నారు. ఇదేనా జగన్ 2019లో నిషేధం అమలు చేస్తానన్న హామీ వెనుక అసలు కథ అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.

## లిక్కర్‌లో ఆల్కహాల్ శాతాన్ని బట్టి ట్యాక్స్!

- కర్ణాటకలో నూతన చట్టం తెచ్చిన సీఎం సిద్దరామయ్య
- 60 ఏళ్ల ఎక్సైజ్ పాలసీకి మంగళం పాడిన సర్కారు
- ఇక నుంచి డిస్టిలరీలు, బ్రూవరీస్‌లో మద్యం రుచి చూడొచ్చు



అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కర్ణాటక రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ పాలసీని తీసుకువచ్చారు. శుక్రవారం కర్ణాటక విధాన సౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2026-27 ఎక్సైజ్ పాలసీని ప్రకటించారు. దీంతో 60 ఏళ్లుగా కొనసాగుతున్న ఎక్సైజ్ చట్టానికి చరమగీతం పాడినట్లయింది. నూతన సంస్కరణలతో మద్యం వినియోగదారులపై భారం ముందు తగ్గనున్నది.

## విధ్వంస పాలనకు భిన్నంగా దూరదృష్టితో కూటమి పరిపాలన

- విధ్వంస పాలన నుంచి అభివృద్ధి దిశగా రాష్ట్రం
- కూటమి ప్రభుత్వం దార్శనికంగా ముందుకు
- గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం వెనక్కి
- ప్రజా సంక్షేమం, పారదర్శకతతో ప్రతి రూపాయి ఖర్చు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

గత ప్రభుత్వం విధ్వంసం, విచ్ఛిన్నంతో కూడిన పాలన సాగిస్తే కూటమి ప్రభుత్వం దూరదృష్టి, దక్షత, దార్శనికతతో కూడిన పాలన అందిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో ఆర్థిక విధ్వంసం సృష్టించి రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టివేశారని విమర్శించారు. ఆ విధ్వంసం వల్ల రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు.



## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు



## భారత్‌లో పెరిగిన బిలీనియర్లు

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై



## 58 అడుగుల అమరజీవి కాంస్య విగ్రహం

- 16న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ
- అమరావతిలో 6.8 ఎకరాల్లో 'త్యాగ స్మృతి వనం' ఏర్పాటు
- రాష్ట్ర బీసీ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడి



## పాక్, సౌదీ మధ్య భద్రతా చర్చలు



- 'ఇస్లామిక్ నాటో'కు అడుగులు పడుతున్నాయా అని అనుమానాలు
- సౌదీ రక్షణ మంత్రితో పాకిస్థాన్ సీడీఎఫ్ ఆసిమ్ మునీర్ భేటీ
- ఇరాన్ దాడుల నేపథ్యంలో భద్రతా పరిస్థితులపై చర్చ
- అవసరమైతే ఒకరికొకరు రక్షణ కల్పించాలనే ఒప్పందం

## సామాన్యుడిపై గుదిబండ

గృహ వినియోగదారులకు 60 రూపాయల అదనపు భారం

అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ చమురు సంస్థలు సామాన్యుడికి భారీ షాక్ ఇచ్చాయి. వంట గ్యాస్ ధరలను భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మార్చి 7, 2026న అమలులోకి వచ్చింది. ఈ పెంపుతో అటు గృహ వినియోగదారులు, ఇటు వాణిజ్య వర్గాలపై అదనపు భారం పడనుంది.



# ధరలు తగ్గి నష్టపోతున్న కోకో రైతులు

**– ధరల పాలసీ, ఫార్ములా, కోకో గింజలకు ధర నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి.**
**– రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కోకో రైతులు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలి.**
**–ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం పిలుపు.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

కోకో గింజలకు ధరల పాలసీ ప్రకటించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కంపెనీలు ఇష్టారాజ్యంగా అంతర్జాతీయ మార్కెట్ ధరలు సాకు చూపి దేశీయంగా ధరలు తగ్గించి వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. కోకో గింజలకు ధరల పాలసీ, ఫార్ములా, ధర నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు పవర్ పేట లోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు.

ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్ ధర కిలో కోకో గింజలకు రూ.900లకు పైగా ఉంటే రూ.450 మాత్రమే ధర ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ ధర తగ్గిందని కిలో గింజల ధరను రూ.400 నుండి రూ.300,రూ.350 లకు తగ్గించి వేయడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరల పాలసీ ప్రకటించకపోవడం వలన కంపెనీల ఇష్టారాజ్యంగా తయారయ్యిందన్నారు. పైగా రైతుల నుండి కోకో గింజలు కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మోండలీజ్ కంపెనీ కొద్ది మంది రైతులు దగ్గరే గింజలు కొనుగోలు




చేస్తోందని, దాదాపు 80 శాతం మంది రైతులు వద్ద గింజలు కొనుగోలు చేయకపోవడం వలన వేల టన్నుల గింజలు రైతులు వద్ద నిల్వ ఉండిపోయిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.ఇప్పటికైనా ధరల పాలసీ ప్రకటించాలని కోరారు. కిలో కోకో గింజలకు రూ.500 ధర కల్పించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు.ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ గెలలు ధర మాదిరిగా ఫార్ములా రూపొందించి ధర నిర్ణయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చి,నేరవేర్చకపోవడంతో కోకో రైతులు రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రుద్రరాజు సుబ్బరాజు, కొండపల్లి సత్యనారాయణ, ఆర్.సుబ్బారావు,కె.సతీష్ బాబు, ఆలపాటి శ్రీనివాసరావు, ఎం.వి.రత్నాజీ, పి.పెదవీర్రాజు, ఏలూరు, ఉభయగోదావరి జిల్లాల కోకో రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**– మండల విద్యాశాఖ అధికారి ఎన్ విజయ్ కుమార్**

గాయత్రి వార్తలు




విద్యార్థులు బాగా చదువుకొని దేశానికి ఉపయోగపడేలా మంచి పౌరులుగా ఎదగాలని ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. శనివారం పీఎం శ్రీ అక్కంపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్వయం పరిపాలన దినో త్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ పాల్గొన్నా రు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వృత్తుల వారిని తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్న తమైందని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య రూపుదిద్దుకుంటుందని, అలాంటి దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యా యుని పాత్ర చాలా కీలకమైందని అన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, మంచి క్రమశిక్షణ అలవర్చుకోవడానికి ఇలాంటి స్వయం పరిపాలన దినోత్సవం తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయులుగా ఎదగాలని అన్నారు. అనంతరం స్వయం పరిపాలన దినోత్సవం లో ప్రతిభకనబరిచిన వారికి మండల విద్యాశాఖ అధికారి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పులి రామచంద్రను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు ఫిబ్రవరి 7: రిపోర్టర్ : మునిరత్నం





ఇటీవల అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలైన పులి రామచంద్రను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈరోజు పరామర్శించారు. పులి రామచంద్ర నివాసానికి వెళ్లిన ఆయన, రామచంద్ర సతీమణి పులి మౌనికతో పాటు కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ఉండాలని, తాను ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని పులి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, యుగంధర్ రెడ్డి, ఎల్ఐసి చంద్ర, సుధాకర్, ఉత్తరాజి శరవణ కుమార్, కంఠా ఉదయ్ కుమార్, బుల్లెట్ జై శ్యామ్ , మున్నా, రామచంద్రారెడ్డి, కామి వెంకటేశ్వర్లు, శ్రీవారి సురేష్, డాక్టర్ శంకర్, ముని కృష్ణారెడ్డి, లక్ష్మీపతి, వళ్లం గోపి, మధు రెడ్డి, పటాన్ ఫరీద్, పసల సురేష్, మనణి , అట్ల రమేష్, అస్లాం, జల్లేషా, ఫజల్, సి.ఆర్.టి ప్రసాద్, గుణ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదపు అంచున బోటు ప్రయాణం

**– నిండు గోదారిలో ప్రజల ప్రాణాలతో చెలగాటం**
**– రుద్రంకోట రేవులో అర్థరాత్రి వరకు ప్రయాణికుల తరలింపు**
**– పట్టించుకోని వేలేరుపాడు మండల అధికారులు**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

ఏలూరు జిల్లా,వేలేరుపాడు మండలం,రుద్రం కోట రేవులో అర్థరాత్రి వరకు బోటులో ప్రయాణికులను తరలిస్తున్నారు.నిబంధనల ప్రకారం సాయంత్రం 6గంటలలోపే బోటు నడపడం ఆపేయాలి.అత్యవసరమైతే... అంటే ప్రాణాల మీదికి వస్తే,ఏ మార్గం లేకపోతే ..అదీ అధికారులు,పోలీసులు కలిసి జిల్లా అధికారుల పర్మిషన్ తీసుకుని నడపాలి.కానీ అందుకు విరుద్ధంగా..ఉదయం తెల్లవారకముందే మొదలైన బోటు ప్రయాణం అర్ధరాత్రి వరకు నడుపుతున్నారు.

**కరువైన అధికారుల పర్యవేక్షణ:**

పగటిపూటనే కనీస రక్షణ చర్యలు పాటించని బోటు నిర్వాహకులు రాత్రిపూట కూడా కనీసం లైఫ్ జాకెట్లు కూడా ఉపయోగించడంలేదని,ప్రజలు



ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.పోలవరం బ్యాక్ వాటర్ రావడంతో రుద్రంకోట వద్ద గోదావరి నది ఆ ఒడ్డుకు,ఈ ఒడ్డుకు అనుకుని నీరు ప్రవహిస్తోంది.ఆ నీటిపై టార్చ్ లైట్లు,సెల్ ఫోన్ల వెలుతురుతో బోటు నడుపుతుండటం ఎంతో ప్రమాదమని ఆ ప్రాంతం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మండల అధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకుని, అర్ధరాత్రి బోటు ప్రయాణాన్ని నివారించాలని,ప్రజల ప్రాణాలను కాపాడాలని మండలప్రజలు కోరుతున్నారు.

# టీడిపి మండల అధ్యక్షుడిగా ములిశెట్టి నాగు రెండోసారి ఎంపిక





**– ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ అనపర్తి నారాయణ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

తెలుగుదేశం పార్టీ కుక్కునూరు మండల అధ్యక్షునిగా ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) శనివారం రెండవసారి ప్రమాణం స్వీకారం చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో భాగం గా పార్టీ మండల సెక్రటరీ (కార్యదర్శి)గా చుంచు సత్యనారాయణతో పాటు 15 మంది గ్రామ పంచాయతీలకు చెందిన వారు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాస్ లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని ఉండటమే కాకుండా, పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలకు వెన్నెముకలా ఉండి,మండల ప్రజల విశ్వాసాన్ని పొందిన ఏకైక యూత్ నాయకుడు నాగేశ్వరరావు అని కొనియాడారు. అనంతరం పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ అనపర్తి నారాయణ మాట్లాడుతూ యుక్త వయసులోనే ఇంత ప్రజాదరణ పొందిన నాయకుడిని నేను ఇంతవరకు చూడలేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీలో కష్టపడే వారిని గుర్తిస్తారని అదే బాటలోనే నడిచిన నాగును రెండోసారి అధ్యక్షుడిగా చేశారని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొల్లు కృష్ణార్జునరావు,కుకునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, సరిహద్దు సత్యనారాయణ, వెంకటరమణ,రమణ రాజు, పులి శ్రీనివాసరావు,రాంబాబు, సూర్యం,రమణయ్య,యూత్ నాయకులు ఉదయ్, హరిబాబు, నరేంద్ర రాజు, పాదం రాము తదితరులు పాల్గొన్నారు

# క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

**– ఆర్థిక సాయం అందించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు “ఆజాద్”**
**– జిల్లా ఐజీ, ఎస్పీ చేతులమీదుగా అందజేత**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

చింతలపూడి పట్టణానికి చెందిన షేక్ రిజ్వాన అనే మహిళ లంగ్స్ క్యాన్సర్ తో బాధ పడుతూ ఉంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న మేరకు స్థానికులు చింతలపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు,జిల్లా ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వైస్ ప్రెసిడెంట్ అజాద్ దృష్టికి తీసుకు వెళ్ళారు. వెంటనే స్పందించిన అజాద్ బాధితురాలికి ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో తన తండ్రి అజీమ్ షరీఫ్ పేరిట ఉన్న అజీమ్ ఛారిటీ తరుపున పది వేల రూపాయలను ఏలూరు రేంజ్ ఐ. జి. జి.వి.అశోక్ కుమార్,జిల్లా ఎస్ పి ప్రతాప శివ కిశోర్ ల చేతుల మీదుగా శనివారం చింతలపూడి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో అందజేశారు. పాత్రికేయులు సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయం అని ఐ జి అశోక్ కుమార్,జిల్లా ఎస్ పి ప్రతాప్ శివ కిశోర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏ.ఎస్. పి. సుస్మితా, సిఐ క్రాంతి కుమార్,ఎస్సై లు సతీష్ కుమార్,వెంకన్న లు ,పాత్రికేయులు పాల్గొన్నారు.

# మహిళలకు జిల్లా కలెక్టరు శుభాకాంక్షలు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళలందరికీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుంచి దేశ, రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలు సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక, సామాజికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టరు ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అన్ని రంగాలలో మహిళలు పురోగతి సాధించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహిళలు తమ హక్కులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం మరింత పెరగాలని ఆమె ఆకాంక్షించారు.

# కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు...





గాయత్రి వార్తలు

మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాలతో పట్టణంలో భారీ ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు కార్డెన్ సెర్చ్ లో భాగంగా కనిగిరిలోని పలు ప్రాంతాలలో తనిఖీలు పోలీసులను చేపట్టారు. అంతేకాకుండా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అటు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై కూడా పోలీసులు యుద్ధం ప్రకటించారు. శనివారం కనిగిరి పట్టణం పోలీసుల మెరుపు తనిఖీలతో మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి సీఐ శ్రీనివాసరావు, పామూరు సీఐల నేతృత్వంలో పోలీసులు భారీ ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాల్లో కనిగిరి, హెచ్.ఎం. పాడు, పొదిలి, సి.ఎస్. పురం, వెలిగండ్ల ఎస్ఐలు



తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని టకారిపాలెం, మంగళమాన్యం, కాశిరెడ్డి కాలనీ వంటి ప్రాంతాలను జల్లెడ పట్టారు. ప్రతి ఇంటిని, ప్రతి సందును క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు.. సరైన ధృవపత్రాలు లేని సుమారు 33 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.?కేవలం తనిఖీలతోనే సరిపెట్టకుండా, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీసులు గళమెత్తారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ ఒంగోలు బస్టాండ్ నుండి పామూరు బస్టాండ్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి యువతలో చైతన్యం నింపారు. పామూరు బస్టాండ్ వద్ద భారీ మానవహారంగా ఏర్పడి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాల వల్ల మనిషి శారీరకంగా, మానసికంగా కృంగిపోతారని.. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## *నేరాల నియంత్రణే లక్ష్యంగా కార్ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ బాలసుబ్రమణ్యం తెలియజేశారు. కాటన్ సెర్చ్ లో భాగంగా సాగిన ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని సంఖ్యలో వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.*






గాయత్రి వార్తలు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నేడు పోలీసులు భారీ ఎత్తున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, కందుకూరు ఎస్.డి.పి.ఓ. బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ తనిఖీలు కొనసాగాయి. కొండేపి సి.ఐ సోమశేఖర్‌తో పాటు కందుకూరు, ఉలవపాడు, లింగసముద్రం ప్రాంతాలకు చెందిన ఎస్సైలు సుమారు 50 మంది సిబ్బందితో కలిసి కాలనీలోని ప్రతి ఇంటిని, అలాగే అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధానంగా గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టడం, అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయడం మరియు ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించడమే ధ్యేయంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు.?ఈ సోదాల్లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించగా, సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న 33 ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఈ వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కందుకూరు పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ఒరిజినల్ పత్రాలను వెంట ఉంచుకోవాలని, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

### - దాతృత్వం చాటుకున్న చెన్నా కోమలి,మిత్ర బృందం




గాయత్రి వార్తలు

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు చెన్నా కోమలి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దిరిశవంచ నందు 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు.ఇందులో భాగంగా చెన్నా కోమలి మరియు వారి మిత్ర బృందం కలిసి సుమారు రూ.10,000 విలువైన ఫైల్స్, పెన్నులు మరియు ఇతర పరీక్షా సామాగ్రిని 41 మంది విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. మాధవ శర్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈసందర్భంగా కోమలి మాట్లాడుతూ ?పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు భవిష్యత్తులో నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేస్తామని వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా ?విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపి, వారి చదువుకు తోడ్పాటునందించిన చెన్నా కోమలి మరియు మిత్ర బృందాన్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అనిల్ కుమార్, లీలా లావణ్య, కొప్పరపు పరమేశ్వరిలతో పాటు ఉపాధ్యాయులు షేక్ వీరనారాయణ, శంకర్, మురళి, చిరంజీవి, గౌసియా పర్వీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం ఆహ్వాన కమిటీ కో-కన్వీనర్ గా వడ్లమానినారాయణచారి



గాయత్రి వార్తలు

మండల కేంద్రంలోని చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారిని మార్కాపురం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆహ్వాన కమిటీ జిల్లా కో-కన్వీనర్ గా నియమించడం జరిగింది. ఆయన నియామకంపై ప్రాంతీయ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వడ్లమాని నారాయణచారి మాట్లాడుతూ జిల్లాలో విశ్వబ్రాహ్మణ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి నాయకులు కలిసి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాసచారికి వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. మార్కాపురం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆహ్వానం మేరకు చెన్నుపల్లి శ్రీనివాసాచారి జిల్లా స్థాయి నూతన కమిటీ ఏర్పాటుకు ఆహ్వాన కమిటీని నియమించారని, ఆహ్వాన కమిటీ కన్వీనర్ గా చెరుకుపల్లి సుబ్రహ్మణ్యచారిని నియమించారని తెలిపారు. అదేవిధంగా కో-కన్వీనర్లుగా వడ్లమాని నారాయణచారి తో పాటు కందుకూరి శివమణి, డి విశ్వనాథచారి, రాచర్ల శేఖర్, జుమ్మొజు వెంకటేశ్వర్లు, షరాబ్ దత్తచారి లను నియమించడం జరిగిందన్నారు.ఆహ్వాన కమిటీ సమన్వయంతో జిల్లాలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సమావేశం నిర్వహించి, 30 రోజులలోపే నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు విశ్వబ్రాహ్మణ సంఘం ఐక్యతతో ముందుకు సాగేందుకు నాయకులను సభ్యులను కలుపుకొని పనిచేస్తానని అన్నారు సంఘం అభివృద్ధి సభ్యుల సంక్షేమం సామాజిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు కృషి చేస్తానని వడ్లమని నారాయణచారి ఓ ప్రకటనలో తెలిపారు

# కోడిపందాల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

### - 23 మంది అరెస్ట్, నగదు మరియు వాహనాలు స్వాధీనం



గాయత్రి వార్తలు

?పొన్నలూరు, వల్లెటివారిపాలెం మండలాల సరిహద్దుల్లోని మాలపాడు గ్రామ అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలోని నిర్మానుష్య ప్రదేశంలో భారీగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు, వ్యూహాత్మకంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. పోలీసుల రాకను గమనించిన పందెం రాయుళ్లు తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మొత్తం 23 మందిని పట్టుకున్నారు.?ఈ దాడిలో నిందితుల నుండి మూడు పందెం కోడిపుంజులను, వారు వినియోగించిన 18 ద్విచక్ర వాహనాలను మరియు 23 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పందెం కోసం సిద్ధంగా ఉంచిన రూ. 42,860 నగదును కూడా జప్తు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జూదక్రీడలు మరియు కోడిపందాల వంటి చట్టవిరుద్ధ పనులకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. పట్టుబడిన వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### - 53 మందికి 31.73 లక్షలు పంపిణీ



గాయత్రి వార్తలు

ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. మొత్తం 53 మంది 31.73 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తూ వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే, వైసీపీ నేతలు పనికిమాలిన విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపరులు, దొంగలను పక్కన ఉంచుకున్నారు కాబట్టే, గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారని, ఆ పార్టీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి ఇటీవల ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదని, ఇప్పటికీ రప్పా రప్పా అంటూ వెర్రి వేషాలు వేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత ఎన్నికల్లో దారుణ ఓటమిపట్ల జగన్మోహన్ రెడ్డి పశ్చాత్తాపం ప్రకటించి, తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి, రోజురోజుకూ మరింత దిగజారిపోతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అనారోగ్య ఖర్చులు, పేదవారికి ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి చెక్కులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న ప్రతి ఒక్కరూ, కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 9.38 లక్షల రూపాయలు, కందుకూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 5.29 లక్షల రూపాయలు, కందుకూరు పట్టణానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 5.57 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఉలవపాడు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు 6.87 లక్షల రూపాయలు, వలేటివారిపాలెం మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 4.60 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కందుకూరు రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, నాదెళ్ల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా వేములపాడులో 2కే రన్

గాయత్రి వార్తలు

మండలంలోని వేములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నట్లు మండల బిజెపి అధ్యక్షుడు గుంటకాల నరేష్, బిజెపి నాయకులు త్రిమూర్తులు, నరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా సుమారు 150 మంది మహిళామణులతో ప్రారంభించనున్నట్లు తెలిపారు

మహిళల ఆరోగ్యం, ఐక్యత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలం లోని లోని మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## భారత్‌లో ఆ చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది: రానా



నటుడిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు రానా . ఆయన నిర్మించిన చిత్రాలు ప్రశంసలు అందుకోవడం గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌లో కుటుంబ కథా చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని అన్నారు. సంక్రాంతికి ఎన్ని ఫ్యామిలీ డ్రామాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. "మంచి కథలను నిర్మించడానికి నేను ఎప్పుడూ ముందుంటాను. అలాంటివాటిని వెతికి ప్రేక్షకులకు అందించడమే నా లక్ష్యం. ఎంతోమంది సహకారంతోనే ప్రయోగాత్మక చిత్రాలు వస్తాయి. ఇప్పుడు ప్రేక్షకులు కూడా కొత్త కంటెంట్‌నే కోరుకుంటున్నారు. నాకు టెక్నాలజీపై ఆసక్తి ఎక్కువ. అందుకే యాక్టింగ్ వైపు వచ్చినా టెక్నాలజీని నేర్చుకుంటూనే ఉన్నా. ఏదైనా విషయంపై మనకు ఆసక్తి ఉన్నప్పుడు వెనకడుగు వేయకుండా రిస్క్ తీసుకుంటేనే ఫలితం వస్తుంది. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా అనుకున్నది సాధించేవరకూ పోరాడుతూనే ఉండాలి" అని రానా అన్నారు. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంత'లో నటించిన రానా.. ఆ సినిమా నిర్మాతల్లో ఒకరిగాను ఉన్నారు. ఆయన సమర్పణలో వచ్చిన 'విరాట పర్వం', 'గార్గి', '35 చిన్న కథకాదు' ఆదరణ సొంతం చేసుకొని అవార్డులను దక్కించుకున్న విషయం తెలిసిందే.

## అలాంటి పాత్రలు ఇక చేయను!

కెరీర్‌లో కొన్నిసార్లు హిట్ కొట్టాలనే ఆత్రుతతో పాత్రలను అంగీకరించి తప్పు చేశానంటోంది బాలీవుడ్ హీరోయిన్ భూమి పెడ్నేకర్. తాజాగా 'వి ది విమెన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తనని అగౌరవపరిచే పాత్రలు చేయనని వెల్లడించింది. ఇటీవల వచ్చిన 'దల్దాల్' సిరీస్‌లో శక్తిమంతమైన పోలీసు అధికారిగా కనిపించిన భూమి.. గతంలోని పాత్రల ఎంపికలో తప్పు చేసినట్టు ఎప్పుడైనా అనిపించిందా? అని అడిగినప్పుడు తన ఆలోచనల్ని పంచుకుంది. "నేను తప్పులు చేశాను. వాటిలో అతి పెద్దది ఏంటంటే.. కెరీర్‌లో కొన్ని పాత్రలు అంగీకరించాను. కాని వాటిని ఆస్వాదించలేకపోయాను. కెరీర్‌లో ఈ స్థాయికి చేరుకోవడానికి చాలా కష్టపడ్డాను. ఇకపై నాకు అగౌరవాన్ని కలిగించే పాత్రల్ని చేయను"అని అంది.



## సూపర్ హీరోగా.. సల్మాన్?



త్వరలోనే 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రంతో థియేటర్లలో సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్. ఆయన తదుపరి సినిమా కోసం దర్శకద్వయం రాజ్ అండ్ డీకేలతో కలిసి పనిచేయనున్నారని తెలుస్తోంది. సల్మాన్ ప్రధాన పాత్రలో హై కాన్సెప్ట్ సూపర్ హీరో కామెడీ చిత్రాన్ని తెరకెక్కించేందుకు రాజ్ అండ్ డీకే సన్నాహాలు చేస్తున్నారట. ఇప్పటికే ఈ కథను సల్మాన్‌కి వినిపించగా.. ఆసక్తి చూపించడంతో పాటు భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ని చేసే ఉద్దేశం తనకు లేదని, బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని స్క్రిప్ట్‌ని అభివృద్ధి చేయాలని దర్శకులను కోరినట్టు సమాచారం. ప్రస్తుతం దర్శకులు ఈ సినిమాలో సల్మాన్ పాత్రకు స్క్రీన్‌ప్లేని సిద్ధం చేస్తున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అన్నీ కుదిరితే నవంబరులోనే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. జీవితంలో యాక్షన్ ఘట్టాలనుంచి రిటైర్ అయిపోదామనుకునే సూపర్ హీరోని పరిస్థితులు పదేపదే యాక్షన్ మోడ్‌లోకి తీసుకెళ్లే కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది.



## నాగ్జిల్లాలో ప్రీతి!

గ్లామర్‌కు నటనను జోడించి.. కలువ కళ్లతోనే హావభావాలను పలికించి యువతని విశేషంగా ఆకట్టుకుంటోంది కథానాయిక ప్రీతి ముకుందన్. ఇటీవలే మలయాళ చిత్రం 'సర్వం మాయ'లో తక్కువ స్క్రీన్ టైమ్‌లో మెరిసినా ఈ తార నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే పడ్డాయి. తాజాగా ప్రీతి హిందీ చిత్రపరిశ్రమలో అడుగుపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్ హీరోగా రూపొందుతున్న 'నాగ్జిల్లా' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తుందట. ఇప్పటికే ఆమె సినిమాలోని కీలకమైన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేసిందని, ఇంకా ఏడు రోజులు షూటింగ్ మాత్రమే మిగిలి ఉందని సమాచారం. హారర్ ఫాంటసీ కామెడీగా ఈ సినిమాని మృగదీప్ సింగ్ లంబా తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్, మహావీర్ జైన్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. "ప్రీతి 'నాగ్జిల్లా'లో నాయిక. ఇందులో పాత్రకు ఆమె సరిగా సరిపోతుందని నిర్మాతలు ఎంపిక చేశారు. కార్తిక్ నాగ్ అనే సర్పం పాత్రను పోషిస్తున్నాడు"అని చిత్రవర్గాలు చెప్పినట్టు సమాచారం. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## వారణాసి'.. ఆ అనుభవం ఎప్పటికీ మర్చిపోలేను: ప్రియాంక చోప్రా



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం గురించి తాజాగా ప్రియాంక చోప్రా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. కెన్యాలో జరిగిన షూటింగ్‌ను గుర్తుచేసుకున్నారు. కెన్యాలోని అడవుల్లో వేల సంఖ్యలో వైల్డ్ బీస్ట్స్ (భారీ జింకలు) వలస వెళ్తున్న సమయంలో, వాటి మధ్యలో నిలబడి షూటింగ్ చేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని ప్రియాంక పేర్కొన్నారు. ఆ జంతువులను అంత దగ్గరగా చూసినప్పుడు కలిగిన అనుభూతిని ఆమె వివరిస్తూ.. "వాటి ముఖాలు చూస్తుంటే అవి ఎన్ని వేల ఏళ్లుగా భూమి మీద మనుగడ సాగిస్తున్నాయో అర్థమైంది. ప్రకృతి ఎంత శక్తిమంతమైనదో, ఈ భూమిపై జీవపరిణామం ఎంత గొప్పదో వాటిని చూస్తే తెలిసింది. ఆ అడవిలో షూటింగ్ ఒక గొప్ప అనుభూతి" అని ప్రియాంక అన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఈ సినిమా షూటింగ్ కెన్యాలో జరిగింది. అక్కడ షూటింగ్ క్షణాలు ఎప్పటికీ మర్చిపోలేనివని రాజమౌళి కూడా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

**ఆస్కార్ ప్రజెంటర్‌గా ప్రియాంక..**

నటి ప్రియాంక తాజాగా గొప్ప గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. మార్చి 15న జరగనున్న ఆస్కార్ వేడుకల్లో ఆమె ప్రజెంటర్‌గా వ్యవహరించనున్నారు. హాలీవుడ్ ప్రముఖులతో కలసి ఆమె ఒక విజేతకు అవార్డు అందించనున్నారు. ఇటీవల జరిగిన గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల్లోనూ ఆమె ప్రజెంటర్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆస్కార్ ప్రజెంటర్‌ల జాబితాలో నిలవడంతో ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.